రూ.లక్షలు వ్యయం.. నెరవేరని లక్ష్యం

- మూలనపడిన విద్యుత్ ఆటోలు.. పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛ ఏపీ కార్యక్రమం పొన్నూరు పట్టణంలో పూర్తిగా పడకేసింది. పథకం అమలులో భాగంగా లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన చెత్త సేకరణ విద్యుత్ ఆటోలు మూలకు చేరి, నిరుపయోగంగా మారాయి. వాటికి చిన్న పాటి మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో కొంతకాలంగా షెడ్డుకే పరిమితమయ్యాయి. సకాలంలో స్పందించాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పొన్నూరు: పొన్నూరు మునిసిపాలిటీకి ఆరు విద్యుత్ ఆటోలను జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం అందించింది. శానిటేషన్ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఈ–ఆటోలు వినియోగానికి నోచుకోవడం లేదు. నెలల తరబడి వాడుకలో లేకపోవడంతో మూలనపడి తుప్పు పడుతున్నాయి. పట్టణంలోని 31 వార్డులలో 16,716 నివాసాల నుంచి ప్రతి రోజు 35 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతుంది. 157 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించేందుకు నెలకు రూ.2.10లక్షలు వాహనాల ఆయిల్‌కు ఖర్చవుతోంది. ఎలక్ట్రిక్ ఆటోలను వినియోగిస్తే మునిసిపల్ నిధులు ఆదా అయి ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగపడుతాయి. పారిశుద్ధ్య కార్మికులపై పని భారం కూడా తగ్గే అవకాశం ఉంది. ఈ–ఆటోల వినియోగం లేకపోవడంతో పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటోంది. వెంటనే ఈ ఆటోలకు మరమ్మతులు చేసి వినియోగించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొందరు స్వార్థంతో ఈ–ఆటోలు మూలకు..

ఈ–ఆటోల పర్యవేక్షణకు సచివాలయ కార్యదర్శులను ప్రభుత్వం నియమించింది. అయితే సచివాలయ కార్యదర్శుల ప్రమేయంతో శానిటేషన్ సిబ్బందికి అక్రమార్జనకు గండి పడింది. గతంలో మేస్త్రిలుగా పనిచేసిన కార్మికులను ఆటో డ్రైవర్లుగా పని చేయమని కమిషనర్ గతంలో ఆదేశించారు. ఈ–ఆటోలతో తమ కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడటంతో ఆటోలకు మరమ్మతులు సృష్టించి, ఆ నెపంతో మూలన పడేసినట్లు తెలిసింది. వారి చర్యలకు శానిటేషన్ సిబ్బంది, అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నట్లు సమాచారం. రూ.లక్షలు వెచ్చించి ఈ ఏడాది జూన్ లో వచ్చిన అధునాతన ఎలక్ట్రిక్ ఆటోలకు అప్పుడే మరమ్మతులు రావడం గమనార్హం.


మూలన పడిన విద్యుత్ ఆటోలు


బండిపై చెత్త సేకరిస్తున్న కార్మికురాలు

ఈ–ఆటోలను ఉపయోగంలోకి తెస్తాం



ఈ–ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దూరాభారాన్ని భరించలేకపోతున్నాయి. ప్రభుత్వం అందించిన 6 ఆటోలలో 4 వాహనాలు వినియోగంలో లేవు. అన్ని ఈ–ఆటోలను సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొస్తాం. ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపడతాం.

– నయీమ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, పొన్నూరు

క్లుప్తంగా

విద్యార్థుల కార్తిక దిపోత్సవం



పెదకాకాని: కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని వీవా వీవీఐటీ విద్యార్థులు మంగళగిరిలోని ప్రఖ్యాత రాజ్యలక్ష్మీ సమేత శ్రీనరసింహస్వామి దేవాలయంలో వైభవంగా కార్తిక దీపోత్సవం నిర్వహించారు. దాదాపు పది వేల ప్రమిదల వెలుగుల్లో శ్రీనరసింహస్వామి దేవాలయం దేదీప్యమానంగా వెలిగిపోయింది. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణ ప్రియ దంపతులు పాల్గొని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్‌వీఆర్ జేసీలో ఫ్రెషర్స్ డే వేడుకలు




గుంటూరు రూరల్: ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థి దశే కీలకమని, మధుర జ్ఞాపకాలను నింపే విధంగా ఉండాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏలలో ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులను స్వాగతిస్తూ శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా విద్యార్థులు కృషిచేయాలన్నారు. కళాశాల కీర్తి ప్రతిష్టతలు ఇనుమడింపజేయాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, వివిధ విభాగాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

‘చలపతి’ కళాశాలకు జాతీయ అవార్డులు



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి లక్ష్యంగా విద్యా బోధన చేయడం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. శనివారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ కళాశాలకు ఇండస్ట్రీయల్ స్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో జాతీయ స్థాయి అవార్డు వరించిందన్నారు. అదేవిధంగా కర్యూకలమ్ ఇంటిగ్రేషన్ అవార్డ్స్–2023లో బెస్ట్ పర్ఫామింగ్ అవార్డు, జాతీయ స్థాయిలో రెండు అవార్డులు వరించాయన్నారు. ఆల్ ఇండియా వర్చువల్ ఇంటర్న్‌షిప్ 2023 ర్యాంకింగ్‌లో 16వ స్థానాన్ని దక్కించుకుందన్నారు. ఏఐసీటీఈ ఎడ్యుస్కిల్స్ ఇంటర్న్‌షిప్‌లను అధిక సంఖ్యలో కళాశాలగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నట్లు తెలిపారు. సౌత్ ఇండియాలో బెస్ట్ కర్యూకలమ్ అవార్డును దక్కిందచుకుందన్నారు. కళాశాలకు అవార్డులను అందించిన అధ్యాపకులను, ప్రిన్సిపల్‌ను విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ డి.తిరుపతినాయుడు పాల్గొన్నారు.

చిప్స్‌లో ముగిసిన ఫార్మసీ వారోత్సవాలు



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో లక్ష్యసాధన దిశగా కృషిచేయాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ అన్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఐదు రోజులుగా కళాశాల, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఫార్మసీ ఉత్సవాలు ముగిశాయి.

ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ నూతన పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ హెల్త్ ఎడ్యుకేషన్ బాడీ సభ్యుడు డాక్టర్ పి.ఉమాశంకర్ ఆరోగ్య రక్షణ విధానాలను వివరించారు. విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్, మధుమేహ టెస్టులు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.సుబ్బారావు విద్యార్థులతో కలిసి ఓబులునాయుడుపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్ కురువిళ్ళ పాల్గొన్నారు.

ఎక్సెల్ ఆర్ సంస్థతో ‘కళ్లం’ కళాశాల అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలను అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రముఖ సంస్థలతో అవగాహన ఒప్పందాల ద్వారా విద్యార్థుల ఉపాధికి తమ కళాశాల కృషి చేస్తోందని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఎడ్యుటెక్ కంపెనీ ఎక్సెల్ ఆర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. సాంకేతిక అంశాలపై ఎక్సెల్ ఆర్ సంస్థ ద్వారా ప్రముఖ కార్పొరేట్ కంపెనీల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ చేయడానికి సహాయ సహకారాలు అందిస్తారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కార్పొరేట్ కంపెనీలలో ఉపాధి అవకాశాలు పొందుతారని కళాశాల ఉపాధి శిక్షణ అధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి సర్వం సిద్ధం

పొన్నూరు: పొన్నూరు పట్టణంలో 15 వందల సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పురాతనమైన స్వయం వ్యక్త క్షేత్రంగా స్వర్ణపురి (పొన్నూరు)లో వేంచేసి ఉన్న శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్న స్వామి అష్ట బంధన మహా కుంభాభిషేక మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం రఘునాథ బాబు పర్యవేక్షణలో 27న ఉదయం 8 గంటలకు విశ్వక్సేన ఆరాధన పుణ్యాహం ఆచార్యాది రుత్విక్‌కరణంతో ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 28న ఉదయం 8 గంటలకు విశ్వక్సేన ఆరాధన, కుంభ ఆరాధన, హోమం, సాయంత్రం 4 గంటలకు మహా శాంతి అభిషేకం, శాంతి హోమం గ్రామ బలి నిర్వహణ జరగనుంది. 29న తెల్లవారుజామున 5 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్ని ఆరాధన, కుంభ ఆరాధన, ఉత్త హోమం, శ్రీ భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు, చెన్నకేశవ స్వామి, లక్ష్మీ నరసింహ స్వామి, దాసాంజనేయ స్వామి, విభన సాచార్య స్వామి, రామానుజాచార్య స్వామి వార్లకు ఉదయం 9 గంటల ఐదు నిమిషాలకు కుంభాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు.


మహా కుంభాభిషేకం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

శివాలయంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ అయోధ్య రామిరెడ్డి

పెదకాకాని: కార్తిక మాసం సందర్భంగా పెదకాకాని శివాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సూచించారు. శివాలయం పరిసర ప్రాంతాలను శనివారం ఆలయ చైర్మన్ శివశంకర్ రావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, స్థానిక సర్పంచ్ శ్యామ్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. పరిశుభ్రత విషయంలో గతం కంటే మెరుగ్గా ఉన్నారని, మొక్కలు నాటి పచ్చదనం మెరుగుపరచాలని ఎంపీ వారికి సూచించారు. మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయంత్రం 7 ఆలయ ప్రాంగణంలో శివలింగాకారపు కోటి దీపోత్సవం, ఆలయ ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు, జ్వాలా తోరణము పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనరు శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు.


శివాలయంలో పనులు పరిశీలిస్తున ఎంపీ అయోధ్య రామిరెడ్డి

ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కాకుమాను: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాలనీలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీ వాసులు గత 40 సంవత్సరాల నుంచి ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక డొంక రోడ్డు సమస్యకు పరిష్కారం చూపారు. రోడ్డు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సహకారంతో రూ.90 లక్షల వ్యయంతో డొంక రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు నిర్మాణం వల్ల ఎస్సీ కాలనీ వాసుల సమస్యతో పాటు మండలంలోని చిన కాకుమాను గ్రామ ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుపలేటి శివకుమారి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, మెరిగల సుందరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


శ్మశాన వాటిక డొంక రోడ్డును పరిశీలిస్తున్న నేతలు

‘చలపతి’ కళాశాలలో ఘనంగా ఫార్మసీ వారోత్సవాలు

గుంటూరు రూరల్: ఫార్మసీ వారోత్సవాల వల్ల విద్యార్థులు తమ విద్యార్థి దశ నుంచి ఔషధాలపై అవగాహన కలిగి ఉంటారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అన్నారు. నగర శివారులోని లాం నందున్న కళాశాలలో జరుగుతున్న 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్యులు రోగి రుగ్మతను కనిపెట్టి ఔషధాలను సూచిస్తారని, వారికి తగిన సూచనలు చేసే బాధ్యత ఫార్మసిస్ట్‌లదేనని తెలిపారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పాల్గొన్నారు.


విజేతలతో కళాశాల యాజమాన్యం

జీజీహెచ్‌లో జనరిక్ మందుల షాపు ప్రారంభం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ క్యాజువాలిటీ ఎదుట డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా చౌక ధరలో జనరిక్ మందుల్ని రోగులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కమిటీ అధ్యక్షురాలు ఏ.శారమ్మ, కార్యదర్శి ఎం.ఝాన్సీరాణి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జనరిక్ మందుల షాపు ఇంచార్జి షంషేర్, స్త్రీ నిధి డైరెక్టర్ కె. అరుణ, జిల్లా సమాఖ్య కమిటీ సంయుక్త కార్యదర్శి చల్లా వాసంతి పాల్గొన్నారు.

రచయిత్రి సుజాతకు పురస్కారం

పాత గుంటూరు: గుంటూరుకు చెందిన రచయిత్రి ఏవీకే సుజాత ఒంగోలు కళా మిత్ర సంస్థ రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం ఒంగోలులో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. అమృత హృదయం, వ్యాస సుమాలు, నవ్యాంధ్ర నానీలు, బాలల కవితలు పుస్తకాలను ఆమె రాశారు. నవ్యాంధ్ర రచయితల సంఘ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అభినందనలు తెలిపారు.

బాలలతో పనులు చేయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

చేబ్రోలు: బాలలతో పనులు చేయిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.ఆనంద్ శనివారం తెలిపారు. పాతరెడ్డిపాలెం గ్రామంలోని రాయల్ ఇండస్ట్రీస్‌లో పనులు చేస్తున్న ఇద్దరు, చేబ్రోలు – నారాకోడూరు గ్రామాల మధ్య ఉన్న బ్రిక్స్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న బాలుడికి విముక్తి కల్పించినట్లు వివరించారు. బాలల చేత పనులు చేయిస్తున్న షాపు యజమానులపై కార్మికశాఖాధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడికి గాయాలు

చేబ్రోలు: మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చేబ్రోలులో చోటుచేసుకుంది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు చేబ్రోలు శివారులోని సిమెంటు వరలు, కిటికీలు, సిమెంట్ పనిముట్లు తయారీలో కూలీగా పనిచేస్తున్నాడు. తన పుట్టిన రోజు కావటంతో స్నేహితులతో కలిసి, స్థానిక వైన్ షాపు వద్ద మద్యం సేవించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి అదుపు తప్పి పడిపోయాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్రగాయమైంది.బాధితుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం



పెదనందిపాడు: పూసులూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని టీడీపీ నేతలు ధ్వంసం చేశారని, నిందితులను పట్టుకొని శిక్షించాలని పెదనందిపాడు సొసైటీ డైరెక్టర్ బొనిగల సుబ్బారావు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జెండా దిమ్మె ధ్వంసంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

జీజీహెచ్‌లో ఆరోగ్యమిత్రలకు బయోమెట్రిక్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పనిచేసే ఆరోగ్య మిత్రలకు డిసెంబర్ 1 నుంచి ఎఫ్ఆర్ఎస్, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలోని జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రానికి వచ్చే రోగులకు ఆరోగ్య మిత్రలు సేవలు అందించే విషయంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలపై స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పట్నంబజారు: విద్యార్థుల్ని తరలిస్తున్న ఆటోల్ని శనివారం నగర ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈస్ట్ సబ్ డివిజన్ సీఐ కోటేశ్వరరావు, వెస్ట్ సబ్ డివిజన్ సీఐ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో నగరంలోని ముఖ్య కూడళ్లలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమతులకు మించి తరలిస్తున్న వాహనాల్ని నిలువరించి, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలువురికి జరిమానాలు విధించారు.

వ్యక్తి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనులో నివసించే బి.ప్రభుకిశోర్ రెండు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 6304572079 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- ప్రజలందరి అవసరాలు తీర్చడమే లక్ష్యం
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- పెదకాకాని, వెనిగండ్ల, అగతవరప్పాడులో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన

పెదకాకాని: మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండల పరిధిలోని పెదకాకాని, వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాల్లో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌లకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి అవసరాలు తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మండల పరిధిలోని మూడు గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ట్యాంక్ నిర్మాణం, మంచినీటి పైప్‌లైన్, ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ పథకం కింద ఈ పనులు చేపడుతున్నామన్నారు. పెదకాకాని గ్రామంలో 120కేఎల్ సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ తదితర పనులను రూ. 125.10 లక్షలు, వెనిగండ్ల గ్రామంలో 60 కేఎల్ సామర్థ్యంతో వాటర్ ట్యాంకు నిర్మాణం, మంచి నీటి పైపులైను, ప్రతి ఇంటికి కుళాయి పనులను రూ. 52.60 లక్షలు, అగతవరప్పాడు గ్రామంలో 60 కేఎల్ సామర్థ్యంతో వాటర్ ట్యాంకు నిర్మాణం, మంచినీటి పైపులైను, ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు పనులను రూ. 42 లక్షలతో చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు షాహన్ని, జకీర్, పార్టీ మండలాధ్యక్షుడు అమ్మిశెట్టి శివశంకరరావు, నాయకులు పిట్టు శ్రీనివాసరెడ్డి, కె.అంజిరెడ్డి, గోళ్ళ స్వరూపరాణి, శ్యామ్‌ముఖర్జీ, జోసఫ్ కుమార్, వి.నాగరాజు, కె.వెంకటేష్, మోజెస్ కుమార్, మల్లేశ్వరరావు, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవిప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

రాజ్యాంగానికి లోబడి జీవించాలి

పారా సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ తురకా మంగయ్య

ప్రత్తిపాడు: ప్రతి వ్యక్తి భారత రాజ్యాంగానికి లోబడి జీవించినప్పుడే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని పారా సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ తురకా మంగయ్య అన్నారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మానవ హక్కుల క్లబ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలన్నారు. కులమతాలు, ప్రాంతీయ బేధాలు లేకుండా ఇతరులకు సహాయం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగ పీఠికను ప్రతి ఒక్కరూ గౌరవించాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం క్లబ్ సభ్యులందరూ రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గైడ్‌టీచర్ అరుణ్‌ప్రదీప్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంగయ్య, విద్యార్థులు

తురకపాలెంలో వికసిత్ భారత్ యాత్ర

గుంటూరు రూరల్: దేశాభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అన్నారు. శనివారం తురకపాలెం గ్రామంలో వికసిత్ భారత్ ప్రచార యాత్ర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వివరించారు. ఎంపీడీవో ఆది నారాయణ ప్రభుత్వాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఇంటూరి అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి